భారతదేశపు తొలి మహిళా డాక్టర్

# డాక్టర్ ఆనందీబాయి జోషీ

# జీవిత చరిత్ర

శ్రీదేవీ మురళీధర్

ఎమెస్కో




## ఒక మహా మహిళ సంస్మరణలో...

ఒకటిన్నర శతాబ్దాల క్రితం, వైద్యసదుపాయం లేక బిడ్డను పోగొట్టుకున్న ఒక తల్లి భారతావనిలో మహిళల విముక్తి కోసం ఒక ఉద్యమానికి జన్మనిచ్చింది. ఆమె ధైర్యం, త్యాగం ఫలితంగా వచ్చిన మార్పు ఒక ముఖ్యకారణంగా స్త్రీవిద్య, మహిళాసాధికారత క్రమక్రమంగా ప్రధాన స్రవంతి ఆలోచనాధారగా పరివర్తన చెందాయి. ఈనాడు డాక్టర్ ఆనందీబాయిని విద్యాధికులైన తరతరాల భారతీయ మహిళలకు పూర్వీకురాలిగా గౌరవించటం సముచితం.

మనం చారిత్రక వ్యక్తుల గురించి ఎక్కువ ఆసక్తి చూపించము. మనలాంటి సాధారణ వ్యక్తులే అయినా వాళ్ళు అడ్డంకులను అధిగమించి పట్టుదలతో తమ లక్ష్యాన్ని సాధించిన విశేషాన్ని మనం ఆమోదించక, ఆ వ్యక్తి సాధించిన విజయం ముందే నిర్దేశించినట్లు భావిస్తాము. ఆ వ్యక్తి చాలా కాలం క్రితం జీవించిన మనిషి కాబట్టి, అప్పటి ఆ మనిషి పోరాటాలు ఈనాడు మనకు ప్రాసంగికంగా ఉండవు. వారిని విస్మరిస్తాము. ఆనందీ జోషీ విషయంలో ఈ ఆలోచనలేవీ వర్తించవు. ఆమె కథలో ఈ నాటికీ మనకు చాలా స్ఫూర్తినిచ్చే శక్తి ఉంది.

ఆనాడు గర్భశోకాన్ని అనుభవించిన మహిళలు, అది తమ కర్మగా భావించి తమను తాము ఓదార్చుకున్నారు. ఉమ్మడి కుటుంబాలలోని వృద్ధ మహిళలు వారిని ఓదార్చి, బిడ్డలను పోగొట్టుకున్న దుఃఖానికి ఉపశమనంగా ఉపవాసాలు, ఆచారాల వైపు మనసు మళ్లించారు. కానీ, కేవలం కొన్ని సంవత్సరాల విద్య మాత్రమే ఆనందీని మార్చడం ప్రారంభించింది. చదువు వల్ల మూల కారణాలను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఆలోచనావిధానం ఆమెకు అబ్బింది. వైద్య సంరక్షణ అందుబాటులో లేనందువల్ల మాత్రమే తన బిడ్డను కోల్పోయానని ఆమె గ్రహించింది. వాస్తవానికి ఆ సమయంలో భారతదేశంలో పాశ్చాత్య శిక్షణ పొందిన వైద్యులు చాలా తక్కువ మంది ఉన్నారు. పురుష వైద్యుల ముందు సిగ్గు, లజ్జ గురించిన నమ్మకాల కారణంగా ఆ కొద్దిమంది వైద్యులు కూడా మహిళారోగులకు చికిత్స చేయలేకపోయారు.



# డాక్టర్ ఆనందీబాయి జోషీ జీవితచరిత్ర

1865 - 1887


(కెరోలైన్ డాల్ రాసిన ఆనందాబాయి జోషీ ఆంగ్ల జీవితచరిత్ర ఈ అధ్యాయానికి ఆధారం)

భరతభూమి వేదభూమి, పుణ్యభూమి మాత్రమే కాదు, తల్లి వంటి మాతృభూమి. అనాదికాలం నుండి మహిళలు వేదోపనిషత్తులలో, శాస్త్రజ్ఞానంలో, సాహిత్య, కవిత్వాలలో తమ ప్రజ్ఞ, విద్వత్తు చాటుకున్నారు. సంప్రదాయ-సంస్కృతులు ఆమోదించినా లేకున్నా మహిళల అడుగు ప్రగతిపథం దిశగానే సాగిందని చెప్పటానికి వేనవేల తార్కాణాలున్నాయి. అటువంటి స్త్రీమూర్తులలో అనర్ఘరత్నం డాక్టర్ ఆనందీబాయి జోషి.

ధ్యేయాలను సాకారం చేసుకోవటం, అవరోధాలను దాటుకుని ముందుకు సాగటం అప్పటి తరం మహిళలలో అధిక శాతం మంది కలలో కూడా ఊహించలేనివి. ఆ కాలంలోనే డాక్టర్ ఆనందీబాయి స్త్రీల జీవితంలో విద్యాసముపార్జన ప్రాముఖ్యాన్ని తన జీవితమే ఉదాహరణగా చాటి చెప్పింది. ఆనందీబాయి జన్మనామం యమున.

మహారాష్ట్రలోని పూనా నగరంలో సనాతనాచారపరులైన మహారాష్ట్ర చిత్పవన్ బ్రాహ్మణుల వంశంలో గణపతిరావు అమృతేశ్వర జోషీ, గంగూబాయి దంపతులకు 1865 సంవత్సరం మార్చ్ 31వ తేదీన యమున అనే అమ్మాయి పుట్టింది. గణపతిరావు దంపతుల పది మంది సంతానంలో ఆమె ఆరవది. యమునకు నలుగురు అన్నదమ్ములు, ఐదుగురు అక్కాచెల్లెళ్లు. ఒక అక్క బాలవితంతువు. యమునకు పదేళ్లు వచ్చేసరికే ఇద్దరు అన్నలు, ఒక అక్క, ఒక చెల్లెలు మరణించారు.

మహారాష్ట్రంలోని థాణే జిల్లాలోని కళ్యాణ్ అనే నగరం యమున తండ్రిగారి స్వస్థలం. అక్కడ ఆయనకు భూములు ఉండేవి. ఉన్నత కులస్థుడిగా సమాజం ఆయనను గౌరవించేది. దగ్గర బంధువైన గంగూబాయితోనే గణపతిరావు వివాహం జరిగింది.



పూనా నగరం యమున తల్లిగారి పుట్టిల్లు. 500 సంవత్సరాల క్రితం వీరి వంశీకుడు మరాఠా రాజావారి వద్ద సైన్యాధిపతి పదవి నిర్వహించగా రాజావారు ఒక రాజ భవనాన్ని, అరవై అగ్రహారాలను ఈనాముగా వీరికి దయ చేశారు. ఆ రాజప్రాసాదం యమున తాత ముత్తాతల కాలం నుంచీ వీరి అధీనంలోనే ఉన్నది. గంగూబాయి పినతండ్రి పూనాలో పేరెన్నిక గన్న వైద్యుడు కాబట్టి గంగూబాయి తన ప్రసవానికి పూనా చేరుకుంది. అక్కడి రాజప్రాసాదంలోనే యమున జన్మించింది. యమున బాల్యం పూనాలోను, కళ్యాణ్‌లోనూ గడిచింది. ఆమె తండ్రి ముద్దులపట్టి. తమ ఇంటి తోటలో, తండ్రి ఒడిలో, ఆమె ఎంతో సంతోషకరమైన సమయాన్ని గడిపినట్లు ఆమె జ్ఞాపకాలు చెబుతాయి.

గణపతిరావు జోషీకి ఎన్నెన్నో అగ్రహారాలుండేవి. ఎప్పుడూ ఒక ఆస్థాన పురోహితుడు ఆయనను వెన్నంటి ఉండేవాడు. ఆ రోజులలో సంపన్నుల ఇళ్లల్లో అది విధాయకం. ఐశ్వర్యవంతులైన యూరోపియన్లు ఆ కాలంలో ఫాదరీలను వెంట తిప్పుకునేవారు. వారి పంథాలోనే సంపన్నులైన భారతీయులు కూడా నడిచేవారు. ఈ పురోహితుడు ఇంటికి సంబంధించిన పూజాది కార్యక్రమాలు శ్రద్ధగా నిర్వర్తించేవాడు. అర్చామూర్తులను శుభ్రపరచి పూజకు సిద్ధం చేసేవాడు. మతపరమైన మంచిచెడ్డల గురించి సలహా చెప్పేవాడు. దానధర్మాలు, మొక్కులు సూచించేవాడు.

పసితనంలో ఒకనాడు యమున తన బొమ్మలతో ఆడుకుంటూ పురోహితుడు నిత్యపూజకు అర్చామూర్తులను శుభ్రపరచి వాటికి తైలం రాసి పూజాస్థానంలో పెట్టటం కుతూహలంగా గమనించింది. ఆ లోహవిగ్రహాలు తాను ఆడుకునే బొమ్మల్లాగా ఉలుకూపలుకూ లేకుండా ఉన్నాయి. పసిపాపల్లాగా అవి రుద్దినప్పుడు ఏడవటం లేదు, స్వస్థానంలో పెట్టేస్తే నవ్వటం లేదు. వాటిలో ఎటువంటి చలనమూ లేదు.

తన తండ్రి ఒడిలోకి చేరుకొని అమాయకంగా ప్రశ్నించింది చిన్నారి యమున, 'నాన్నా, ఆ దేవుడి బొమ్మలు నా బొమ్మలలాగే పూజారిగారి చేతిలో కదలకుండా ఉన్నాయేమిటి?'